## ఓటు హక్కు వినియోగించుకోవాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్‌ఆదిత్య యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వసతి గృహాల ఇంజినీరింగ్ విద్యార్థులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ముచ్చటించారు. విద్యార్థుల చదువు, వయసు వివరాలు పేరుపేరునా అడిగి తెలుసుకున్నారు. ఓటు ఉందా, ఎంత మందికి ఓటు ఉంది విషయాలపై ఆరా తీశారు. మీ ఓట్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడం వల్ల మీతో పాటు మీ తల్లిదండ్రుల ఓట్లను కూడా మీరు చూసి వారికి చెప్పడానికి వీలవుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో, ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకోవడం, తెలుసుకోవడం సులువైన విధానం అని, ప్రతి ఒక్కరూ వారి ఓటు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉందో ముందుగానే చూసుకోవాలని తెలిపారు. ఈ నెల 14లోగా ఇసిఐ వెబ్‌సైట్ లేదా ఓటర్ హెల్ప్‌లైన్‌లో దరఖాస్తుకు ఇదే చివరి అవకాశం అన్నారు.

# ఆక్వాకు పూర్వ వైభవం తెస్తాం

నరసాపురం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

- రూపాయిన్నరకే ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్
- ధాన్యం అమ్ముకునేందుకూ లంచాలిచ్చుకునే దుస్థితి
- నర్సాపురం ఎంఎల్ఎ ముదునూరి అవినీతిలో పెద్ద ముదురు
- తాగునీరు, డ్రెయినేజీ, ఫిషింగ్ హార్బర్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
- నరసాపురం పర్యటనలో చంద్రబాబు
- ముస్లింములు, భవన నిర్మాణ కార్మికులు, ఆక్వా రైతులు తమ సమస్యలపై వినతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు

జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోయిందని, తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వా రైతులకు పూర్వ వైభవం తెస్తామని, విద్యుత్ యూనిట్ రూపాయిన్నరకే అందిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం, పాలకొల్లులో ఆయన పర్యటించారు. సాయంత్రం 4.45 గంటలకు నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ఆయన హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డుషోలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై ముస్లింలు, భవన నిర్మాణ కార్మికులు, ఆక్వా రైతులు చంద్రబాబుకు వినతిపత్రాలు ఇచ్చారు. సాయంత్రం 5.50 గంటలకు నరసాపురం పట్టణంలో స్టీమర్ రోడ్డుకు చేరుకున్న ఆయన అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి మాట్లాడారు. తొలుత జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నరసాపురంలో తాగునీటి ఇబ్బంది ఉందని, తీర ప్రాంతంలో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నప్పటికీ డయాలసిస్ సౌకర్యాలు లేవని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడాక చంద్రబాబు మాట్లాడుతూ రైతుల పరిస్థితి ఏమాత్రం బాగోలేదన్నారు. ఎంత టెక్నాలజీ పెరిగినా రైతు లేకపోతే తిండి దొరకదన్నారు. జిల్లాలో ధాన్యం రైతులకు సంచులు ఇచ్చే పరిస్థితి లేదంటూ విమర్శించారు. లంచాలు ఇచ్చి ధాన్యం అమ్ముకునే దుస్థితికి జగన్ తీసుకొచ్చారన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రతియేటా రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

**నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి పెద్ద ముదురు**

నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అవినీతిలో పెద్ద ముదురు అని చంద్రబాబు విమర్శించారు. ఏటిగట్టు పనులు నాసిరకంగా చేసి దోచుకున్నాడన్నారు. మెడికల్ కాలేజీ వస్తుందని చెప్పి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశాడని, కాలేజీ మాత్రం రాలేదని అన్నారు. రైతుల వద్ద ఇళ్ల స్థలాల కోసం భూములు తక్కువకు కొని మింగేశాడన్నారు. ఇసుక అక్రమ రవాణాతో రూ.30 కోట్ల వరకు దోచుకున్నాడన్నారు. లేఅవుట్లకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలోకొచ్చాక తిన్నదంతా కక్కిస్తామన్నారు. పెదమైనవానిలంకలో సముద్రపు కోతకు గురికాకుండా గోడ నిర్మిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. వలలు, బోట్లు అన్ని ఇస్తామన్నారు. పేరుపాలెం బీచ్‌తో పాటు మిగిలిన ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వశిష్ట గోదావరిపై వంతెన, షిప్పింగ్ హార్బర్ వంటివి అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రతి పేద కుటుంబానికి రెండు సెంట్లు ఇంటి జాగా ఇస్తామన్నారు. వాటర్ స్కీమ్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా

పాలకొల్లు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

తాగునీరందిస్తామన్నారు. భూగర్భ డ్రెయినేజీ ద్వారా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, జనసేన నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబుకు నేతల స్వాగతం**

ప్రజాగళం సభ నిమిత్తం నరసాపురం విచ్చేసిన చంద్రబాబుకు నరసాపురం జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ, టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి గుండా రోడ్డు షో నిర్వహించారు. జనసేన కార్యాలయం వద్ద చంద్రబాబుకు కేరళ డ్రమ్స్‌తో స్వాగతం పలికారు. పంజా సెంటర్లో ముస్లిం సమస్యలపై మాజీ శాసన మండలి ఛైర్మన్ షరీఫ్ ఆధ్వర్యంలో చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ముస్లిం సోదరులు సత్కరించి ముస్లిం టోపీని చంద్రబాబుకు అందజేశారు.

**మొదటి నెల నుంచే రూ.4 వేలు పింఛను**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి నెల నుంచే పింఛన్ రూ.4 వేలకు పెంచి ఇస్తామని టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. అలాగే ఏప్రిల్ నుంచి పెంపు అమల్లోకి తీసుకొచ్చి మూడు నెలలకు సంబంధించిన ఎరియర్స్ రూ.మూడు వేలు కూడా అందిస్తామని చెప్పారు. పాలకొల్లు పట్టణంలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం ఆయన ప్రజాగళం సభలో మాట్లాడారు. పాలకొల్లు ఎంఎల్ఎ రామానాయుడును మరోసారి మంచి మెజార్టీతో గెలిపించాలని, చేసిన అభివృద్ధి పనులన్నీ గుర్తుంచుకోవాలని కోరారు. సర్పంచులకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ తాను అధికారంలోకి రాగానే విడుదల చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. సర్పంచులకు నిధులు, విధులు ఇస్తానని తెలిపారు. దమయపత్రి డ్రెయిన్‌ను ప్రక్షాళన చేస్తామన్నారు. అందరికీ అనువైన ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ హయాంలో చేపట్టి ప్రస్తుతం నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నీ తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. పాలకొల్లులో నిర్మించిన 7,150 టిడ్కో ఇళ్లు ఆగస్టులో ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. పాలకొల్లు కేంద్రంగా ఐటి పార్క్, ఆక్వా కల్చర్ హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. రైతు, కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. వంద పడకల ఆసుపత్రికి పెంచి డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తానన్నారు. జిల్లాలో మాదిగలకు ఒక ఎంఎల్‌సి, మాలలకు ఒక ఎంఎల్‌సి కేటాయిస్తానని ప్రకటించారు.

**రఘురామకృష్ణంరాజు సేవలు వినియోగించుకుంటాం**

పార్టీలో చేరిన ఎంపీ రఘురామకృష్ణంరాజు సేవలు అన్నివిధాలా ఉపయోగించుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. అందరి ఆమోదంతోనే రఘురామకృష్ణంరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించి ఆయనకు పార్టీ కండువా కప్పారు. రఘురామకృష్ణంరాజును అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేసినప్పుడు అన్ని ప్రయత్నాలూ చేసి క్షేమంగా బయటకు తీసుకొచ్చామన్నారు. ఆయనకు టిక్కెట్ అంశంపై స్పందించకుండా పార్టీకి రఘురామకృష్ణంరాజు సేవలు వినియోగించుకుంటామని తెలిపారు. ఈ సభలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు, బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మతోపాటు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు, జనసేన నాయకులు బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్ల 'రాజీ'నామాలు!

- రాజీనామాలు చేయండంటూ అధికార పార్టీ నేతల ఒత్తిడి
- గౌరవ వేతనం రూ.5 నుంచి రూ.10 వేల వరకూ ఇస్తామని ఎర
- జిల్లాలో వందలాది మంది వాలంటీర్లు రాజీనామా
- కోడ్ ఉల్లంఘించిన 15 మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగింపు

'ఎన్నికల విధులకు దూరంగా ఉండాలి. కోడ్ అమల్లో ఉన్నందున అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, దూరంగా ఉండండి.. లేకపోతే వేటు తప్పదు'.. ఇవీ ఉన్నతాధికారుల హెచ్చరికలు. 'మీరంతా రాజీనామాలు చేయండి... వచ్చేది మన ప్రభుత్వమే.. మళ్లీ మీకే ఉద్యోగాలిప్పిస్తాం.. గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తాం' అంటూ అధికార పార్టీ నేతల ఒత్తిడి.. ఈ రెండింటి నడుమ వాలంటీర్లు విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదుర్కొంటూ కేసుల బారిన పడుతున్న వాలంటీర్లు దిక్కుతోచని స్థితిలో మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో రాజీనామా చేసిన వాలంటీర్లు

వైసిపి అధికారం చేపట్టాక వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో వాలంటీర్లదే కీలకపాత్ర అనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వం కూడా వాలంటీర్లపైనే ఆధారపడి పాలన సాగించింది. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలు తెరపైకి రావడంతో వాలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కోర్టు ఆదేశాలిచ్చింది. అదే సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం కూడా హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో 9,167 మంది గ్రామ, వార్డు వాలంటీర్లు పని చేస్తున్నారు. ఇటీవల కాలంలో వీరిలో సుమారు 20 మందిపై అధికారులు చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే పింఛన్ల పంపిణీ పనిని వాలంటీర్ల నుంచి తొలగించడంతో వారిలో ఒకింత సందిగ్ధత నెలకొంది. సందట్లో సడేమియాగా వాలంటీర్లు రాజీనామా చేసి ఎన్నికల ప్రచారం, డబ్బు పంపకాల్లో భాగస్వాములు కావాలని పోటీలో ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. వారిని నియమించే సమయంలోనే అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారు. పార్టీకి అనుకూలంగా లేనివారిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ మూడు నెలలకోసారి ప్రకటిస్తూ ఎంపిడిఒల స్థాయిలోనే నియమిస్తూ వచ్చారు. అయితే గ్రామ, వార్డు వాలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం పదే పదే హెచ్చరిస్తున్నా కొందరు వాలంటీర్లు అత్యుత్సాహంతో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ వాలంటీర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల భీమవరం, ఉండ్రాజవరం, నరసాపురం వంటి ప్రాంతాల్లో వాలంటీర్లపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని నిర్ధారిస్తూ సుమారు 15 మందిని విధుల నుంచి కలెక్టర్ తొలగించారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన వాలంటీర్ తమ గ్రూపులో అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పోస్ట్ పెట్టడంతో సంబంధిత వాలంటీర్‌పై కేసు నమోదు చేశారు. ఒకపక్క అధికార పార్టీ ఒత్తిళ్లు, మరోపక్క ప్రతిపక్షాల విమర్శలతో వాలంటీర్లు సతమతమవుతున్నారు. అయితే కేసులు నమోదు చేసేందుకు సైతం ఎన్నికల సంఘం సిద్ధం కావడంతో వాలంటీర్లను భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు శ్రీకారం చుట్టారు. భీమవరంలోనే ఈ కాలంలో సుమారు 700 మంది వరకూ వాలంటీర్లు రాజీనామా చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు 1500 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలిసింది. మరో రెండు, మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న వాలంటీర్లంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సమాయతమవుతున్నట్లు సమాచారం.

**మళ్లీ మీరే అంటూ భరోసా**

వైసిపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుంది. మళ్లీ మీకే వాలంటీర్ల పోస్టులు ఇస్తామని అధికార పార్టీ నేతలు రాజీనామా చేస్తున్న వారికి భరోసా కల్పిస్తున్నారు. వైసిపిని మరోసారి అధికారంలోకి తేవాల్సిన బాధ్యత వాలంటీర్లదేనని నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని భరోసా కల్పిస్తున్నారు. వాలంటీర్లు అభ్యర్థుల ప్రచారం, పంపిణీల్లో బహిరంగంగా పాల్గొనాలని ఒత్తిడి తీసుకొస్తున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో వారంతా పడ్డారు. చిన్నపాటి చిరుద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులను సైతం వదులుకుని వాలంటీర్లుగా పని చేస్తున్నామని, ఇప్పుడు దీనికే ముప్పు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ కృషి

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

బడుగు బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూనే కుల నిర్మూలన ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకులుగా జగ్జీవన్ రామ్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. రాజకీయ రంగంలోనూ ప్రవేశించిన ఆయన వివిధ పదవుల్లో సమర్ధవంతంగా పని చేశారన్నారు. ప్రధానంగా కుల నిర్మూలన కోసం ఉద్యమాలు నడిపారన్నారు. జెసి ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో ఉండాలనే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాలతో పాటు స్త్రీలకు కూడా విద్య విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.శోభారాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పాపారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** స్వాతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ మార్గం అనుసరణీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం పడాల గ్రామంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను పైకి తీసుకురావడానికి ఆయన నిరంతరం తపించేవారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, పడాల జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షులు గడ్డం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## లావాదేవీలు రూ.10 వేలు మించితే చెప్పండి

### బ్యాంకర్లకు ఎన్నికల ప్రత్యేక అధికారి చెన్నయ్య ఆదేశం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక అధికారి చెన్నయ్య

పది వేల రూపాయలకు మించి లావాదేవీలు జరిగితే బ్యాంకు ఖాతాల వివరాలను తమకు ఎప్పటికప్పుడు బ్యాంకర్లు అందజేయాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి కె.చెన్నయ్య బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఆయన బ్యాంకర్లు, మత పెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీగా నగదు విత్‌డ్రా చేసినా వారి వివరాలు తమకు తెలియజేయాలన్నారు. కొత్త వ్యక్తుల పేరున ఎక్కువ అకౌంట్లు తెరుస్తున్న వాటి సమాచారాన్ని కూడా అందజేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరిగినట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. మందిరాలు, మసీదులు, దేవాలయాల్లో రాజకీయ నాయకులు, అభ్యర్థులతో సభలు ఏర్పాటు చేయరాదని తెలిపారు.అలా చేస్తే వారి వివరాలు తమకు తెలియజేయాలన్నారు.

## మెరుగైన పోలింగ్ శాతం సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ శాతం సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 14,63,014 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే రూరల్‌లో ఎక్కువ శాతం, అర్బన్‌లో తక్కువ శాతం పోలింగ్ నమోదవుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఆయా ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కేంద్ర బలగాల అధ్వర్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, గతంలో జరిగిన ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పోలీస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, డబ్బు, మద్యం, తదితర వాటిని సీజ్ చేస్తున్నామని తెలిపారు.

## పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే..

### కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

కొండేపూడిలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న గోపాల కష్ణంరాజు అన్నారు. కొండేపూడి గ్రామంలో శుక్రవారం గోపాలకృష్ణంరాజు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ హామీలు, పథకాల కరపత్రాలను గోపాలకృష్ణంరాజు ఇంటింటా తిరిగి పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం తనకు ఉండి ఎంఎల్ఎ టిక్కెట్ కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్రంతో పాటు మిగతా రాష్ట్రాలు కలిపి 9 అంశాల్లో తయారు చేసిన మేనిఫెస్టో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు మహిళే మహాలక్ష్మి పథకంలో భాగంగా ఏడాదికి రూ.లక్ష చొప్పున ప్రతి నెలా రూ.8,333 అందించడం జరుగుతుందన్నారు. అలాగే రూ.2 లక్షలు రైతులకు రుణమాఫీ, ప్రత్యేక హోదా, కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, ఉపాధి కూలీకి రోజుకు రూ.400 వేతనం, వృద్ధులు, వితంతులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందించనున్నట్లు తెలిపారు. ఇలా అనేక పథకాలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తనను ఆదరించి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యం రాజు (జెఎస్ఆర్), బ్లాక్ కాంగ్రెస్ ఉండి మండల అధ్యక్షులు అడబాల శ్రీనివాసరావు, ఉండి మండల అధ్యక్షులు వి.కొండలరావు, ఆకివీడు మండల అధ్యక్షులు చింత ఆదిశేషు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి జగ్జీవన్ రామ్

### యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయ రామరాజు, ఎకెవి.రామభద్రం అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత పార్లమెంటులో నలభై ఏళ్లపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా వ్యవహరించారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బీహార్‌లోని అర్రా సమీపంలోని చంద్వాలో భారతీయ కుల వ్యవస్థలోని చమర్ కులంలో జన్మించారన్నారు. 1914 జనవరిలో ప్రాథమిక విద్య స్థానిక పాఠశాలలో అభ్యసించారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పి.సీతారామరాజు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ తన మెట్రిక్యులేషన్ మొదటి డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించి, 1927లో బనారస్ హిందూ యూనివర్సిటీలో చేరారన్నారు. జెవివి.నాయకులు చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బిఎస్‌సి డిగ్రీ పొంది 1931లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడయ్యారన్నారు. జిల్లా కార్యదర్శి పి.శివప్రసాద్ మాట్లాడుతూ తొలి ఎదుగుదల నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోల్‌కతాలో 1928లో వెల్లింగ్టన్ స్క్వేర్‌లో మజ్దూర్ ర్యాలీ నిర్వహించారన్నారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడారు.

**పాలకోడేరు :** జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రభుత్వరంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకుందామని, వర్గీకరణ పేరుతో మోసం చేస్తూ ఓట్లు దండుకోవాలని చూసే బిజెపిని ఓడించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు పిలుపునిచ్చారు. జగ్జీవన్ రామ్ జయంతి పాలకోడేరు గురువుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కె.మహంకాళి అధ్యక్షతన జరిగిన సభలో క్రాంతిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులుగా, ప్రజా ప్రతినిధిగా పనిచేసి, దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు కె.నరేష్, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు, నాయకులు, గురువుపేట ప్రజలు, యూత్ పాల్గొన్నారు.

# అధిక ధర వసూలు చేస్తే కఠిన చర్యలు

## అంబులెన్స్ యజమానులకు కలెక్టర్ హెచ్చరిక

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలోని అంబులెన్సు ఓనర్లు నిర్దేశించిన ధరలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని అంబులెన్స్ యజమానులు ఇష్టారీతిగా రోగులు, వారికి సబంధించిన వారి వద్ద నుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై జిల్లా రవాణాధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కిలోమీటర్ల వారీగా ఛార్జీల పట్టికను విడుదల చేసినట్లు చెప్పారు. ఇంతకుమించి ఎవరైనా అధికంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఛార్జీల పట్టిక ప్రతి వాహనంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఫిర్యాదులు చేసేందుకు ప్రభుత్వాసుపత్రి వద్ద మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. 8500814033, 9390411784, 9154294686 నెంబర్లకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ఆదిత్య

# శిశు మరణాలను నివారించాలి : జెసి

**ప్రజాశక్తి - భీమవరం**

శిశుమరణాలను జీరో శాతం చేయడమే లక్ష్యమని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ఆదిత్య అన్నారు. ఏరియా హాస్పిటల్‌లో స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు ఏర్పాటు కోసం గదులను ఆయన డిసిహెచ్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవీకళ్యాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్రంలో కాకినాడ ఏరియా హాస్పిటల్‌లో మాత్రమే స్వచ్ఛ తల్లిపాల బ్యాంకు ఉందని చెప్పారు. భీమవరం ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని డిసిహెచ్, సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.


శివరామరాజును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

# ఎస్ఆర్‌కెఆర్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వివి.శివరామరాజు బీజు పట్నాయక్ యూనివర్సిటీ, రూర్కెలా, ఒడిశా నుంచి పిహెచ్‌డి పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు తెలిపారు. క్రికెట్‌లో విన్నర్ ప్రెడిక్షన్ లైవ్ స్కోర్ అంచనా ప్లేయర్ సెలక్షన్ అంశాలపై మిషన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ టెక్నాలజీతో చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున డాక్టర్ వివి.శివరామరాజును కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరామరాజు మాట్లాడారు. శివరామరాజును కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, సహచార ప్రొఫెసర్స్ అభినందించారు.

# వాలంటీర్ల రాజీనామా

**ప్రజాశక్తి - ఆకివీడు**

ఆకివీడు మూడో సచివాలయం పరిధిలో 19 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ తెలిపారు. పట్టణంలో 168 మంది వాలంటీర్లలో 33 మంది రాజీనామా చేశారు.

# ఆశీర్వదించి గెలిపించండి

## వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల

**ప్రజాశక్తి - ఉండి**


మాట్లాడుతున్న ఉమాబాల

సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. ఆశీర్వదించండి అని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. మండలంలోని మహాదేవపట్నంలో శుక్రవారం నిర్వహించిన బిసి ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తనకు ప్రతిఒక్కరూ మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు, బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆచంట వేమవరంలో శ్రీరంగనాధరాజు ప్రచారం

**ప్రజాశక్తి - ఆచంట**

ప్రచారంలో శ్రీరంగనాధరాజు

ప్రజల సంక్షేమం, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఎల్ఎ శ్రీరంగనాధరాజు అన్నారు. ఆచంట వేమవరంలో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకంలో భాగంగా కలిగిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు, సర్పంచి జక్కంశెట్టి చంటి, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సుంకర సీతారామ్, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గణేశుల శేషవాణి సుబ్బారావు, కొండేటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండి సేవ చేస్తా

## ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఆటోలో ప్రచారం చేస్తున్న శివరామరాజు

నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఎన్నికల్లో తనకు మరోసారి అవకాశం కల్పించాలని ఉండి స్వతంత్ర అభ్యర్థి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) కోరారు. పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజు గ్రామాల్లో ఆటోలో తిరుగుతూ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎంతో మందికి సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. పదేళ్లు ఎంఎల్ఎగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు బడుగు, బలహీన, వర్గాలకు అండగా ఉన్నానని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపతిరాజు రాంబాబు, రవి రాజు, మహంకాళి రావు, పద్మావతి, మధు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# శిథిలావస్థకు బొబ్బిలి వంతెన

**భయాందోళనలో ప్రజలు**
**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**
**అమలు కాని సిఎం జగన్ హామీ**

రైయిలింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన

**ప్రజాశక్తి - గణపవరం**

శిథిలావస్థకు చేరిన వంతెన

గణపవరం వెంకయ్య వయ్యేరుపైన ఉన్న బొబ్బిలి వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితిలో ఉన్నప్పటికి స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనకు 1934లో అప్పటి రాజవంశీయులు గణపతి దేవరాయులు బొబ్బిలి వంతెన అని నామకరణం చేసి నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. వంతెనపై నుంచి 48 ఏళ్ల పాటు వాహనాల రాకపోకలు జరిగాయి. కాలక్రమేణ రాజుల కాలం చెల్లింది. అధికారంలోకొచ్చిన ప్రభుత్వం, అధికారులు వంతెన మరమ్మతుల విషయం మరిచిపోవటంతో వంతెనకు ఉన్న ఇనుప గడ్డర్లు వంగిపోయి 1982లో వంతెన కూలిపోయింది. ఆ సంఘటనలో భువనపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందారు. వంతెన కూలిపోవటంతో గణపవరం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, ద్వారకాతిరుమల, చింతలపూడి వంటి ప్రాంతాలకు వెళ్లడానికి వీలు లేకుండా ఉండేది. బొబ్బిలి వంతెన మీదుగా ప్రతిరోజు వందలాది వాహనాల రాకపోకలు జరుగుతాయి. వంతెన కూలిపోవటంతో గణపవరం, నిడమర్రు, మండలాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు మూడేళ్ల పాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి విరిగిపోయిన ఇనుప గడ్డర్లను తొలగించి పాత సిమెంటు కాంక్రీట్ పిల్లర్లపైన వంతెన నిర్మించారు. దీంతో వంతెనపై వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. వంతెన నిర్మించి 42 ఏళ్లు అవ్వడంతో శిథిలావస్తకు చేరింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రైయిలింగ్ కూలిపోయింది. అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేశారు. దీంతో అవి మళ్లీ కూలిపోయాయి. ప్రస్తుతం వంతెన ఫ్లాటుఫారంపైన రహదారి పగుళ్లతో ప్రమాద పరిస్థితిలో ఉంది. 2022లో సిఎం జగన్ గణపవరం పర్యటన సందర్భంగా నిర్వహించిన సభలో స్థానిక ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు గణపవరం, నారాయణపురం, గుండుగొలను వంతెనలను నిర్మించడానికి నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. దీనిపై స్పందించిన జగన్ నిధులు కేటాయించి వంతెనల నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కూలి పోకముందే కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనపై ఉన్న రంధ్రం

ప్రమాదానికి గురైన బాలిక

## రంధ్రం నుంచి జారి పడిన చిన్నారి

### కాపాడిన స్థానికులు

బొబ్బిలి వంతెనకు ఉన్న రంధ్ర నుంచి జారి మూడేళ్ల చిన్నారి వెంకయ్యవయ్యేరులో పడింది. స్థానికంగా పిట్టలు కొట్టుకుని జీవించే ఎన్.గిరిబాబు, శాంతి దంపతులకు కుమార్తె రాణి ఉంది. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో తల్లి కుమార్తె శాంతి, రాణి కలిసి వంతెనపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వంతెనకు ఉన్న రంధ్రం నుంచి రాణి జారి వెంకయ్య వయ్యేరులో పడిపోయింది. దీంతో తల్లి శాంతి భయంతో కేకలు వేయగా స్థానికులు వెంకయ్యవయ్యేరులోకి దిగి చిన్నారిని రక్షించారు. వయ్యేరులో దట్టంగా గుర్రపు డెక్క, తూడు ఉండడంతో బాలికకు ఎటువంటి గాయాలు కాలేదు. వంతెన విషయంలో అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

# యువతకు ఆదర్శం బాబూ జగ్జీవన్‌రామ్

## ఘనంగా జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - భీమవరం**

ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ - విజ్ఞాన సాంస్కృతిక వికాస కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.వీరయ్య, ఎన్.విజయకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసఫ్, అసోసియేషన్ సెక్రటరీ ఎన్.విజయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజబాబు, వైస్ ప్రెసిడెంట్ అమూల్యారావు, కోశాధికారి డాక్టర్ ఎంవిఎస్.ప్రసాద్, సభ్యులు కె.శ్రీనివాసరావు, కె.సోమయ్య, కె.నాగరాజు, ఎన్.రాజేందర్, బహజన జెఎసి కన్వీనర్ తాళ్లూరి మధు, ఉపాధ్యక్షులు బి.రమేష్‌బాబు, ఈది రవికుమార్, బుంగా ఆదాము, వి.సువర్ణరాజు, పి.శ్రీనివాసరావు, కె.మేరీ పాల్గొన్నారు.

కాళ్లలో..


పెనుమంట్రలో...

**పెనుమంట్ర :** అణగారిన, బడుగు వర్గాల ఆశాజ్యోతిగా వారి జీవితాల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వెలుగులు తెచ్చారని టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. మల్లిపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్‌అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహానేతల పుట్టినరోజులు ఏప్రిల్‌లో రావడం గొప్ప విశేషమన్నారు. వారి ఆశయాల సాధనలో అందరూ ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

**ఆచంట :** సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయులు, పేదలు, అణగారిన వర్గాల కోసం పోరాడిన ధీరుడు భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. మండలంలో కొడమంచిలి అరుంధతిపేటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ఆచంట మండలాధ్యక్షులు ఆకుమర్తి రాంబాబు, వైసిపి మహిళా విభాగం మండలాధ్యక్షురాలు కొండేటి లక్ష్మి, ఆలయ కమిటీ మెంబర్ కొండేటి వెంకాయమ్మ, వార్డు మెంబర్ చింతపర్తి హరికృష్ణ, సచివాలయ కన్వీనర్ కొండేటి వరప్రసాద్ పాల్గొన్నారు.

**తణుకు రూరల్ :** బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను తణుకు బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు న్యాయవాదులంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఈద రామకృష్ణ, ట్రెజరర్ ఎం.మృత్యుంజయరావు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ముప్పిడి సుబ్బయ్య, గొల్లపల్లి అంబేద్కర్, వెన్నపు సుధాకర్, కామన మునిస్వామి, కండిబోయిన ఆనంద్, కొల్లి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

**గణపవరం :** మండలంలోని వెంకట్రాజపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎం.సురేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. గణపవరం డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.వెంకటరమణ మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు టి.అక్కరాజు, సిహెచ్.చైతన్య, కె.స్వరూపరాణి, ఎఎన్‌విఎన్‌బి శ్రీనివాసరావు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

**కాళ్ల :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు చేశారని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. వేంపాడు గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్, అభిరుచి కాశీరాజు, సీనియర్ ఎంఆర్‌పిఎస్ నాయకులు రాపాక ప్రసాద్, జిల్లా అధ్యక్షులు ముసుకూడి రాము, విజిలెన్స్ మానిటర్ కమిటీ సభ్యులు ముమ్ముడివరపు ఏసుపాదం పాల్గొన్నారు.

**పోడూరు :** మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మాజీ సర్పంచి చంటిరాజు, బాలాజీ, యూత్ నాయకులు పాల్గొన్నారు.

**పాలకోడేరు :** భీమవరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

**పాలకొల్లు :** పాలకొల్లులోని వైసిపి కార్యాలయంలో, గాంధీ బొమ్మల సెంటర్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, టిటిడి పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాలా నర్సయ్య, జెసిఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీబొమ్మల సెంటర్, తహశీల్దార్ కార్యాలయ సెంటర్లలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, జనసేన నాయకులు బోనం చినబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కనుమూరి సీతారామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, కొండేటి నరేష్, కుందుర్తి సురేష్ పాల్గొన్నారు.

**భీమవరం రూరల్ :** టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎన్నికల కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దళిత నాయకులతో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎద్దు ఏసుపాదం, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సహకరించాలి

## రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

**ప్రజాశక్తి - ఆచంట**

మాట్లాడుతున్న స్వామినాయుడు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో నామినేషన్ల అఫిడవిట్ నమూనా పత్రాలు అందుబాటులో ఉంచామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. ఆచంటలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నామినేషన్‌పై సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో సిద్ధాంతం వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి సరైన విధానంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. అసంపూర్తిగా తప్పులతో నామినేషన్లు దాఖలు చేస్తే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోవాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ ఫారం 26 అఫిడవిట్ తదితర అంశాలపై సందేహాలు నివృత్తి చేయడం కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని ఫిర్యాదుల సేకరణకు కంట్రోల్ రూమ్ నెంబర్ 08814 297299 ఏర్పాటు చేశామని తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఫారం 26 విధానాన్ని వివరించి అఫిడవిట్‌లో ఏ విధమైన ఖాళీలు ఉంచరాదన్నారు. నియోజకవర్గంలో కొత్త ఓటర్లుగా నమోదు కోసం ఫారం 6 ద్వారా ప్రస్తుత ఓటర్లు చిరునామా మార్పు, ఓటు బదిలీ కోసం ఫారం8లో ఏప్రిల్ 14 వరకు అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో సిద్ధాంతం వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి నిఘా పెట్టామని, ఇప్పటివరకు రూ.6,58,890 నగదు సీజ్ చేశామని తెలిపారు. మద్యం అమ్మకాలపై కూడా నిఘా ఉంచామన్నారు. నియోజక వర్గంలో ఇప్పటివరకు 127 బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఐపి శెట్టి, డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాంప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధే వైసిపి ధ్యేయం : చీఫ్ విప్

**ప్రజాశక్తి - మొగల్తూరు**


ప్రచారం చేస్తున్న ముదునూరి ప్రసాదరాజు

రాష్ట్రాభివద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పాలన చేస్తుందని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజ ఆశ్వీరాద కార్యక్రమంలో భాగంగా రామన్నపాలెం పంచాయతీ పరిధి బండారువారిపేట, రాజులవారిమెరక, రామన్నపాలెం, ఆకనవారితోట, పిట్టావారిపేట, పిప్పళ్లవారితోట ప్రాంతాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. గ్రామాల్లోని కృష్ణుడు, సాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు అయితం ధనలక్ష్మి, ఆకన దొరబాబు, నాయకులు అనంత సుబ్రహ్మణ్యం, కట్టా మూర్తి, కట్టా మస్తాన్, పి.శ్రీనివాసరాజు, కలిదిండి వెంకటరాజు, కొల్లాబత్తుల సత్యానందం, వర్ధనపు విజయ్‌కుమార్, కుక్కల కరుణాకర్ పాల్గొన్నారు.

**ముదునూరి సతీమణి ప్రచారం**

**నరసాపురం :** పట్టణంలోని ఆరో వార్డులో చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు సతీమణి ముదునూరి శారదవాణి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి వైసిపి హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బర్రి శ్రీవెంకటరమణ, పతివాడ మార్కేండేయులు, యర్రా శ్రీను పాల్గొన్నారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు మండలంలోని సీతారామపురం నార్త్ గ్రామంలోని రాజుగారితోట గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బంగారు వేలం ప్రకటన
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road,
Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager,
p.hemanth kumar-80746-56196

# పింఛన్ అందజేత

**ప్రజాశక్తి - ఉండి**

ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సచివాలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండో రోజు శుక్రవారం సచివాలయ సిబ్బంది వృద్ధులకు, మంచం బారిన పడినవారికి వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు.

# ప్రజాగళం బహిరంగ సభకు తరలిన టిడిపి నేతలు

**ప్రజాశక్తి - కాళ్ల**

నరసాపురం, పాలకొల్లులో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు భారీస్థాయిలో సీసలి నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్లలో తరలివెళ్లారని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు తెలిపారు.

**మొగల్తూరు :** మండలంలోని పలు గ్రామాల నుంచి నరసాపురంలో నిర్వహిస్తున్న ప్రజాగళం బహిరంగ సభకు టిడిపి శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఆ పార్టీ మొగల్తూరు మండలాధ్యక్షుడు గుబ్బల నాగరాజు పర్యవేక్షణలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

# జనసేనలో చేరిక

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ముత్యాలమ్మపురంలో సత్తి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, తోట గోపీ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు.

# వైసిపిలో చేరిక

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

స్థానిక ఒకటో వార్డుకు చెందిన పలువురు మహిళలు శుక్రవారం డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ కుమార్తె కంచన్, కుమారుడు రాజేష్‌ల సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి కంచన్, రాజేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం స్థానిక 1, 2 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు.

**ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి**

ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన బొడ్డు లలిత, తండ్రి/ సుధాకర్ అను నా యొక్క ఒరిజినల్ బిటెక్ సర్టిఫికెట్లు కనపడటం లేదు. ఎంత వెతికినా సర్టిఫికెట్లు దొరకలేదు. 2017-2021 బ్యాచ్ రోల్ నెంబర్ B170207EE National Institute of Technology Calicut, Kerala State. ఈ సర్టిఫికెట్లు ఎవరికి అయిన దొరికిన యెడల సమాచారం తెలియజేయగలరు.

**బొడ్డు లలిత,** తండ్రి : బొడ్డు సుధాకర్
ఇంటి నెంబర్: 1-82, గోపాల్ నగర్ కాలనీ
ఉప్పలపాడు, కామవరపుకోట మండలం
ఏలూరు జిల్లా - 534439
సెల్: 9398944232

**దస్తావేజులు పోయినవి**

కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు వాస్తవ్యురాలు అయిన గుర్రాల చంద్రశేఖర్ గారి భార్య గుర్రాల హరి ప్రసూనా తెలియజేసుకొనునది.

నాకు ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (1) 626/1990, (2) 1685/1990 నంబర్‌తో రిజిస్టర్ ఆస్తి కలదు. ఈ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ తీసుకొని వెళ్లుచుండగా ఏలూరులో మార్గ మధ్యలో పడిపోయినవి. ఈ ఒరిజినల్ దస్తావేజులు దొరికినవారు ఈక్రింద తెలియపరచిన అడ్రసుకు సమాచారం ఇప్పించండి.

అడ్రస్: గుర్రాల హరి ప్రసూనా
భర్త: చంద్రశేఖర్, డో.నెం. 13-161
తులసి నగర్, కానూరు, కృష్ణా జిల్లా
ఎ.పి. - 520007, సెల్: 9505032354

**ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి**

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, కార్మెల్‌పురం (కచ్చేరి)కి చెందిన కస్సే మేరి, W/o. భాస్కర్ (లేటు) అను నాయొక్క ఒరిజినల్ డాక్యుమెంటు ది. 20-3-2024వ తేదీన కార్మెల్‌పురం (కచ్చేరి) నుండి పోలవరం వస్తుండగా మార్గ మధ్యలో నాయొక్క స్థలానికి సంబంధించిన **ఒరిజినల్ డాక్యుమెంట్స్ పడిపోయినవి. డాక్యుమెంట్స్ నెం. 1908/2019, సర్వే నెంబర్: 610/1, బికె-1, సి.ఎస్. నెం. 2018/2019.** కావున దొరికినవారు ఈక్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

**కస్సే మేరి**
W/o. భాస్కర్ (లేటు)
పోలవరం మండలం, ఏలూరు జిల్లా
సెల్: 8121587365

**In the Court of the Addl. Senior Civil Judge, Eluru**
**E.P. No. 15/2018**
**O.S. No. 117/2016**

*Between:*
Alapati Vara Siva Prasad ...DHR
AND
Musunuri Rambabu ...JDR

వేలం ప్రకటన

పై నెంబరు గల E.P. లో పిటీషనరు షెడ్యూలు దాఖలా Property ని శ్రీ కోర్టు వారు ది. 26-4-2024వ తేదీన వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచినవారు మరియు ఆసక్తి గలవారు పై కోర్టు వారి ఎదుట **ది. 26-4-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీ ఐ.డి. Proofs తో అనగా ఆధారు కార్డు మరియు ఇతర కార్డులతో పై కోర్టు ఎదుట హాజరు కావలెను.

**E.P. SCHEDULE**

Ac. 1.50 cts of land covered by R.S. No. 17/3 of Tallagokavaram (V), Pedavegi (M), W.G.District, K.Kota Sub Registrar within the following boundaries.
**EAST:** Land of Musunuri Lakshmana Rao.
**WEST:** Puntha.
**NORTH:** Musunuri Lakshmana Rao.
**SOUTH:** Land Bikki Ramesh.

**DHR Value: Rs. 3,00,000-00**
**Amina Value: Rs. 30,00,000-00**

**NEKKARAGANTI NARASIMHA RAO**
Eluru Advocate, Eluru
Dt: 04-04-2024 Cell: 98481 18984